

## పీవీకి భారతరత్న ప్రదానం

దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రధానోత్సవ కార్యక్రమం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. దేశ ప్రథమ మహిళ ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తరపున ఆయన కుమారుడు ప్రభాకర్‌రావు ఈ పురస్కారాన్ని స్వీకరించారు. కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, జైశంకర్, కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తదితరులు హాజరయ్యారు.

- వరంగల్ వాయిస్, ఢిల్లీ


# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 241 శనివారం | 30 మార్చి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5






# 'పవర్' పాలిటిక్స్

### ఏ పార్టీ అయితేనేం పదవులే లక్ష్యం

### నీతి, నియమాలకు తిలోదకాలు

### గులాబీ పార్టీ నుంచి 'హస్తం'వైపు

### జంప్ జిలానీలకు టికెట్లిస్తే.. సహకరించమంటున్న కాంగ్రెస్ శ్రేణులు

### కడియం శ్రీహరి, కావ్య చేరికను వ్యతిరేకిస్తున్న ఇందిర

వివరాలు 2లో..

అధికారం లేకుంటే వాళ్లకు నిద్ర పట్టదు.. 'పవర్' పార్టీలో ఉండకుంటే మనసు కుదుటపడదు.. ఎవరేమనుకున్నా మాకేంటి.. మా దారి మాదే.. నీతి నియమాలు అవసరం లేదు.. విలువల గురించి పట్టింపేలేదు.. ఇదీ ప్రస్తుతం రాష్ట్రంలో, వరంగల్ ఉమ్మడి జిల్లాలో నెలకొన్న రాజకీయ పరిస్థితి. తొమ్మిదిన్నరేండ్లు బీఆర్ఎస్‌లో వివిధ పదవులు అనుభవించిన నేతలు ఊసరవెళ్లి రంగులు మార్చినంత ఈజీగా పార్టీలు మారుస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ల కోసం పడరానిపాట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గులాబీ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఇప్పటికే కమలం పార్టీలో చేరారు. దీంతో ఆయనకు వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ టికెట్ ఇచ్చారు. మరోవైపు మాజీ మంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు ఆయన కూతురు కడియం కావ్య కారు దిగి 'హస్తం'పార్టీలో చేరుతున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్



4లో

## టికెట్ ఇచ్చే బాధ్యత మీది.. గెలిపించుకునే బాధ్యత మాది

### బొడ్డు సునీతకు ట్రై సిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ మద్దతు

### ఉత్సాహంగా రన్‌ఫర్ జీసెస్

### కాజీపేట నుంచి సీబీసీ వరకు ర్యాలీ



8లో

## ఓడిపోయే పార్టీనుంచి టికెట్ వద్దనుకున్నాం.. అందుకే తిరస్కరించాం..

### నా బిడ్డను మీ చేతుల్లో పెడుతున్నా

### నన్ను ఆశీర్వదించినట్లే నా కూతురును ఆశీర్వదించాలి

### నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కడియం శ్రీహరి

2లో



## అవకాశవాదులను గుర్తించండి

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

# 'పవర్' పాలిటిక్స్



కడియం చేరికను వ్యతిరేకిస్తూ కార్యకర్తలతో సమావేశమైన ఇందిర

**ఏ పార్టీ అయితేనేం పదవులే లక్ష్యం**

**నీతి, నియమాలకు తిలోదకాలు**

**గులాబీ పార్టీ నుంచి 'హస్తం'వైపు**

**జంప్ జిలానీలకు టికెట్లిస్తే.. సహకరించమంటున్న కాంగ్రెస్ శ్రేణులు**

**కడియం శ్రీహరి, కావ్య చేరికను వ్యతిరేకిస్తున్న ఇందిర**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, సీనియర్ నేత మల్లు రవి తదితరులు కడియం శ్రీహరి, కావ్యను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. వరంగల్ ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ అధిష్టానం కావ్యకు టికెట్ ఇవ్వగా మారిన రాజకీయ పరిస్థితుల్లో ఓటమి భయంతో బరిలో నుంచి తప్పుకుని అధినేత కేసీఆర్‌కు లేఖ రాసిన విషయం తెలిసిందే. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో విజయావకాశాలున్న కాంగ్రెస్ నుంచి కావ్యకు టికెట్ ఇప్పించేలా ఢిల్లీలోని అధిష్టానంతో చర్చలు జరుపుతున్నారు. అయితే కడియం శ్రీహరినే వరంగల్ ఎంపీ స్థానంలో బరిలో దించాలని హస్తం పార్టీ నేతలు భావిస్తుండగా, శ్రీహరి మాత్రం తన కూతురుకు టికెట్ కోసం శతవిధాలా యత్నిస్తున్నారు. ఈ పరిణామాలు కాంగ్రెస్‌లో కింది స్థాయి నాయకులు, కార్యకర్తలకు ఆగ్రహాన్ని తెప్పిస్తున్నాయి. ఇన్నాళ్లు బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించిన కొందరు నేతలు అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరేందుకే సిద్ధం కావడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. లాబీయింగ్ చేసి నాలుగు రోజులు కాకా పట్టగానే ఎంపి టికెట్లు కేటాయించడాన్ని తప్పుపడుతున్నారు.

## ఎంపీ ఎన్నికల్లో టికెట్ల కోసమే..

అధికారం కోసం, పార్లమెంటు ఎన్నికల్లో టికెట్ల కోసం బీఆర్ఎస్ నుంచి వస్తున్న వారికి కాంగ్రెస్ అధిష్టానం ప్రాధాన్యం ఇవ్వడంపై పార్టీ నేతలు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలీబాబా 40 దొంగలుగా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరుతున్న వారి ఉదంతాలను ఉదహరిస్తున్నారు. పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు, పార్టీ జెండా మోసిన నాయకులు, కార్యకర్తల మనోగతాన్ని అధిష్టానంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, పార్టీ నాయకులు అర్థం చేసుకోవాలని సూచిస్తున్నారు.

## కార్యకర్తలను విస్మరించొద్దు..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నుంచి రాజకీయంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు లాఠీ దెబ్బలు తిన్నవారిని కాంగ్రెస్ అధిష్టానం గుర్తించాలంటున్నారు. ముఖ్యంగా వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి టికెట్ ఆశిస్తున్న దొమ్మటి సాంబయ్య, సింగపురం ఇందిరా, బొడ్డు సునీత, పరంజ్యోతి, రామగళ్ల పరమేశ్వర్, పెరుమాండ్ల రామకృష్ణ, నమిండ్ల శ్రీనివాస్ తదితర నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న నాయకులను విస్మరించి ఇటీవల బీఆర్ఎస్ నుంచి పార్టీలో చేరిన ఎంపీ పసునూరి దయాకర్ లేదా ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు డాక్టర్ కడియం కావ్యకు టికెట్ ఇస్తే ఊరుకునేది లేదని వారు స్పష్టం చేస్తున్నారు. అవకాశవాదులను నమ్మి నిజమైన కార్యకర్తలను విస్మరించొద్దని, ఇదే కొనసాగితే పార్టీకి తీరని అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు.

## కడియంను చేర్చుకోవద్దు..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేళ్లు ఎన్నో పదవులు అనుభవించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి మొన్నటి వరకూ నిత్యం కాంగ్రెస్‌ను విమర్శించిన వైనాన్ని పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన రెండు రోజుల అనంతరమే 'ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు అధికారంలో ఉండదు.. మాకు 39 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.. ఎంఐఎంకు 7, బీజేపీకి 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.. మేం తలుచుకుంటే ఆరు నెలలు కూడా కాంగ్రెస్ అధికారంలో ఉండలేదు.. మళ్లీ సీఎంగా కేసీఆర్ వస్తారు..' అని నిత్యం విమర్శలు గుప్పించిన కడియం శ్రీహరి తీరును వివరిస్తున్నారు. దీనిపై టీ–పీసీసీ ప్రధాన కార్యదర్శి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర బహిరంగంగానే వ్యాఖ్యానించారు. కడియం శ్రీహరి తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. టీడీపీలో ఉన్నప్పుడు తొలుత ఎన్టీఆర్‌కు, అనంతరం చంద్రబాబుకు, టీఆర్ఎస్‌లోకి వచ్చాక పదేళ్లు పదవులు అనుభవించి కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచారని విమర్శలు గుప్పించారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరితే భవిష్యత్‌లో బీజేపీలోకి వెళ్లారనే నమ్మకం ఏముందని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై నియోజకవర్గ ముఖ్య నేతలతో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించి పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేయడం చర్చనీయాంశమైంది.

## కావ్యకు సహకరించం..

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో నాలుగింటిని అమలు చేసినా నిత్యం విమర్శలు చేసిన కడియం శ్రీహరి వంటి నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకుంటే రాజకీయంగా ఆత్మహత్య సదృశ్యమే అవుతుందని చెబుతున్నారు. కడియం కావ్యకు టికెట్ ఇస్తే విజయానికి సహకరించమని కార్యకర్తలు తెగేసి చెబుతున్నారు. ఇన్నాళ్లు పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులకు పార్లమెంట్ ఎన్నికల్లో సముచిత ప్రాధాన్యమిచ్చి టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేకుంటే ఈ పార్లమెంట్ ఎన్నికలు బీజేపీకి లాభించే అవకాశముందని స్పష్టం చేస్తున్నారు.

## చేరికలపై వ్యతిరేకత..

కాంగ్రెస్ పునరేకీకరణ అంటూ సొంత గూటికి వస్తున్న లీడర్లంతా గతంలో కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసిన వారే. పాత నేతల రిటర్న్ టు హోమ్ ను అసలు కాంగ్రెస్ వారు వ్యతిరేకిస్తున్నారు. టీడీపీ, బీఆర్ఎస్ లో పదవులు అనుభవించిన వారంతా అధికార దాహంతో కాంగ్రెస్ లో చేరుతున్నారు. వీరి అవసరం ప్రస్తుతం లేకున్నా ద్వారాలు తెరిచి చేర్చుకోవడాన్ని తప్పు పడుతున్నారు. వీరి చేరికలతో నిజమైన కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పే మళ్లీ కాంగ్రెస్ చేస్తుందని, దీనికి మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు. చీడపురుగులు, అవకాశవాదులను కాంగ్రెస్ లో చేర్చుకోవద్దని వారు కోరుతున్నారు.



## కడియం వద్దు..

ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాకను వ్యతిరేకిస్తూ స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను అనిచివేస్తూ, వారిపై అక్రమ కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేసిన వ్యక్తిని పార్టీలోకి తీసుకోవడం అనేది కార్యకర్తల మనోభావాలను పూర్తిగా దెబ్బతీయటమే అవుతుందని హెచ్చరించారు. ఈ చేరికపై పునరాలోచించాలని సూచించారు. ఈ చేరికను రద్దు చేయాలంటూ ముక్తకంఠంతో స్టేషన్ ఘన్ పూర్ మండల కాంగ్రెస్ పార్టీ నేతలు ఏఐసీసీ, టీపీసీసీ పెద్దలను కోరారు.

# అవకాశవాదులను గుర్తించండి

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** స్వలాభం కోసమే పలువురు పార్టీని వీడుతున్నారని అలాంటి అవకాశవాదులను గుర్తించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచించారు. వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం, ఇల్లంద గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన బీఆర్ ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యేపెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి ఎర్రబెల్లి దయాకర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో విధంగా కేసులు పెట్టి మన నాయకులను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. అవన్నీ తిప్పికొట్టే ప్రయత్నం చేసి మనం గట్టిగా నిలబడదామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన విషయాన్ని మరువరాదన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలే కాదు గతంలో అమలులో ఉన్న పథకాలను కూడా పూర్తి చేయలేని పరిస్థితుల్లో ఉన్నారని విమర్శించారు. ప్రజలు ఏదో మార్పు కావాలని తెచ్చిన మార్పే తప్ప ఇది మన పార్టీపై వ్యతిరేకత కాదన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన 420 హామీలు ఏది కూడా సంపూర్ణం కాలేదన్నారు. దీనిని ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో మన పార్టీ ప్రకటించిన అభ్యర్థికి పూర్తి మద్దతుగా గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం. వర్ధన్నపేట నియోజకవర్గం ప్రజలతో నాకు విడదీయరాని బంధం ఉంది కాబట్టి నాపై నమ్మకంతో మీరందరూ కలిసిమెలిసి ధైర్యంగా ఉండాలని కోరారు.

# జిల్లా కోర్టు ప్రాంగణంలో.. ఈ సేవ కేంద్రం

**ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణ బాబు**

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ సేవ కేంద్రాన్ని శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబు ప్రారంభించారు. కేసులయొక్క స్థితిని, కేసు వాయిదా, ఏ తేదీన ఉంది, తదితర వివరాలు తెలుసుకునేందుకు ఈసేవాకేంద్రం ఉపయోగపడుతుందన్నారు. నూతనంగా ప్రారంభించిన ఈ సేవ కేంద్రం కోర్టు న్యాయవాదులకు, కక్షిదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనన్నారు. వివిధ కేసుల్లో చిక్కుకొని కోర్టుకు హాజరవుతున్న కక్షిదారుల సౌకర్యార్థం దీన్ని ఏర్పాటు చేసినట్టు జడ్జి తెలిపారు. ఈ



కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.జయరాం రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి ఎన్.రామచంద్ర రావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, ఏఓ అనితవాణి, కోర్టు సిబ్బంది, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆర్థిక మూలాలపై బీజేపీ దాడి

## కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్

**వరంగల్ వాయిస్, నడికూడ :** కాంగ్రెస్ పార్టీకి చెందిన బ్యాంక్ అకౌంట్ లను ఫ్రీజ్ చేయడానికి నిరసిస్తూ నడికూడ మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేయడం బ్రిటిష్ వారి వల్ల కూడా కాలేదు, బీజేపీతో అయితదా అని అన్నారు. నేడు భారతదేశ ప్రజలు స్వేచ్ఛ వాయువులతో బ్రతుకుతున్నారంటే కాంగ్రెస్ పార్టీ అలుపెరుగని పోరాటంతోనే అన్నారు. దేశానికి స్వాతంత్రం తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశం నుంచి కాంగ్రెస్ పార్టీని దూరం చేయాలని, నిర్వీర్యం చేయాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ ఆర్థిక వనరులపైన దెబ్బ కొట్టేందుకు ప్లాన్ చేయడమే కాక, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీపైన ఎన్నో కేసులు పెట్టి వేధించారని తెలిపారు. వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి గెలిచే అవకాశాలు చాలా ఉన్నాయని తెలిపారు. దానిని ఏ విధంగానైనా దెబ్బకొట్టాలని కాంగ్రెస్ పార్టీ ఆర్థిక మూలాలపైన దాడి చేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యవాదులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దీన్ని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి డా.మలహాల్ రావు, రాయపర్తి ఎంపీటీసీ పర్నెం శ్రీలత -మల్లారెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్ని, మాజీ జడ్పీటీసీ పాడి కల్పన ప్రతాప్ రెడ్డి,



ధర్మారం మాజీ సర్పంచ్ సదానందం, నడికూడ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పం కుమార్ స్వామి, సీనియర్ నాయకులు పెద్దబోయిన రవీందర్ యాదవ్, కంఠాత్మకూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బైరపాక భద్రయ్య, నర్సక్కపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు జుంకాజువ్వ కుమార స్వామి, సర్వాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మనోహర్, వరికోల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు దేవ్ రమేష్, చౌటుపర్తి గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓదెల రవి, పులిగిల్ల గ్రామ కమిటీ అధ్యక్షుడు బళ్ల రమేష్, ముస్తాలపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు దామోదర్, ధర్మారం గ్రామ కమిటీ అధ్యక్షుడు గడల రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరికలు



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్ పూర్ :** నియోజకవర్గం పరిధిలోని జఫర్ గఢ్ మండలం ఉప్పుగల్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరారు. వీరికి బీజేపీ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా తనకు ఈ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజానీకానికి సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అహర్నిశలు నా గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. పార్టీ కార్యకర్తలను, నన్ను నమ్ముకున్న అందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానని, పార్టీ శ్రేణులను కలుపుకొని ముందుకు వెళ్లి ఘనమైన విజయాన్ని సాధిస్తామన్నారు. పాలకుర్తి నియోజకవర్గం నుంచి బీజేపీకి అత్యధిక మెజారిటీ వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని ముందుకు వెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. పార్టీలో చేరిన వారిలో ఉప్పుగళ్లు గ్రామం నుంచి పాక్స్ డైరెక్టర్, బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి గడ్డం రాజు గౌడ్, 2 వార్డు మాజీ మెంబర్ పులి రాజు గౌడ్, బీఆర్ఎస్ కార్మిక విభాగం మండల అధ్యక్షుడు నాయిని యాదగిరి గౌడ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు మూల యాకయ్య గౌడ్, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బుర్ర తిరుపతి గౌడ్, జిల్లా నాయకులు నేరెళ్ల రాజు పాల్గొన్నారు.

## రైలు ప్రమాదాలపై అవగాహన



**వరంగల్ వాయిస్, నడికూడ :** దేశంలో ఎక్కడో ఒకచోట ఏదో ఒక రోజు రైల్వే గేట్ల వద్ద ప్రమాదాలు జరుగుతూ ఉంటాయని, మనం నిత్యం పేపర్లో, టీవీలలో చూస్తూ ఉంటాము. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండడం కోసం నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు నో బ్యాగ్ డే సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిడు అచ్చ సుదర్శన్ రైల్వే గేట్ల వద్ద జరిగే ప్రమాదాలను నివారించేందుకు విద్యార్థులకు ప్రత్యక్షంగా నాటకం ద్వారా చూపించి ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలోనే రైల్వే ట్రాక్ ను ఏర్పాటు చేసి, విద్యార్థులను ఒక ట్రైన్ గా, తోటి విద్యార్థులను ట్రైన్ వస్తున్నప్పుడు గేట్ దాటుతున్నట్లుగా ప్రదర్శన చేయించి ప్రమాదాలు జరుగుతున్న తీరును కండ్లకు అద్దం పట్టే విధంగా చేయించారు. ట్రైన్ వస్తున్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థులను ఫీల్డ్ ట్రిప్స్ తీసుకువెళ్లడం, అదేవిధంగా ప్రత్యక్ష అనుభవాన్ని విద్యార్థుల్లో కలిగించడం ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్, ఉపాధ్యాయులు పోలంపల్లి విజేందర్, నిగ్గుల శ్రీదేవి చేస్తున్నారు.

# వరంగల్ ఎంపీ టికెట్ దొమ్మటి సాంబయ్యకే కేటాయించాలి

**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక పరకాల పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు పరకాల మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు, దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకులు వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ టికెట్ దొమ్మటి సాంబయ్యకే కేటాయించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వరంగల్ పార్లమెంటు పరిధిలో అత్యధిక జనాభా 83 లక్షల జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాల సామాజిక వర్గానికి రెండు సీట్లు కేటాయించారు. కాబట్టి దళిత సామాజిక వర్గమైన చిన్న జాతి వారు కాకుండా ఎక్కువ జనాభా కలిగిన మాదిగ జాతి వారికి వరంగల్ పార్లమెంట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధిష్టానం పునరాలోచించి కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తూ, ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేసినటువంటి దోమ్మటి సాంబయ్యకే సీటు ఇవ్వాలని కోరారు. అలాంటి వారి కాకుండా ఇతరులకు ఇస్తే ఊరుకునేది లేదన్నారు. ఓట్లు చీలిపోయే పరిస్థితి ఉందని, బలమైన అభ్యర్థిగా దొమ్మటి సాంబయ్య మాత్రమే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ నాయకులు మంద రాంచందర్, కౌన్సిలర్ పసుల రమేష్, మాజీ సర్పంచ్ ఇనగాల రమేష్, మాజీ ఎంపీపీ ఒంటెరు రామ్మూర్తి, పరకాల



మండల, పట్టణ ఎస్సీ విభాగం అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకులు గూడెల్లి సదన్ కుమార్, ఏకు రవికుమార్, బొచ్చు రవి, బొచ్చు మోహన్, కొక్కిరాల తిరుపతిరావు, పల్లెబోయిన శ్రీనివాస్, ఉడుత సంపత్, గోవింద ఉపేందర్, బొచ్చు భాస్కర్ ,బొచ్చు అనంత్, కోడెపాక రాజయ్య, మడికొండ సంపత్, పూరెల్ల సూర్యం, అల్లం రఘు నారాయణ, గోవిందా రవీందర్, చెరుపల్లి మొగిలి, దొమ్మటి మల్లయ్య, బొచ్చు జితేందర్ ,దొమ్మటి మధు, ఒంటేరు వరుణ్, అల్లం శ్రీ రామ్ దొమ్మటి కృష్ణ కాంత్, గోవిందా ప్రకాష్, గొట్టే రమేష్, ఒంటేరు సదానందం, ఒంటేరు సుధాకర్, ఒంటేరు రవికుమార్, మడికొండ చంగల్, కొయ్యడ రాజేష్ బొచ్చు కుమార్, పసుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి పురంలో మొరం దందా

### కాలనీ వాసులు, వాహనదారులకు ఇబ్బందులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 2వ డివిజన్ పరిధిలోని రెడ్డిపురం విజయలక్ష్మి కాలనీలో గత కొన్ని రోజుల నుంచి జోరుగా మొరం దందా సాగుతుంది. యాదవ్ నగర్ సర్కిల్ నుంచి రెడ్డిపురం రింగ్ రోడ్డు వరకు రోడ్డు మొత్తం పూర్తిగా గుంతలుగా మారడంతో పలు మార్లు కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది. అంతేగాక గత కొన్ని రోజుల నుంచి మొరం దందా కొనసాగడంతో ట్రాక్టర్లు, టిప్పర్లు తిరగడంతో దుమ్ము, ధూళితో కాలనీ వాసులు, వాహనదారులు నానా ఇబ్బందులకు గురువుతున్నారు. రోడ్డు మార్గంలో అనేక సార్లు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవట్లేదని కాలనీ వాసులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## కడియం శ్రీహరి చేరికపై వ్యతిరేకత



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** కడియం శ్రీహరి చేరికను కాంగ్రెస్ కార్యకర్తల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ కార్యకర్తలతో సింగపురం ఇందిర సమావేశారు. 30 సంవత్సరాల నుంచి కడియం శ్రీహరి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేశాడని దీపాదాస్ మున్షీతో కలిసి స్టేషన్ ఘన్‌పూర్ ఇంఛార్జి సింగాపూరం ఇందిర చెప్పారు. రానున్న 2 రోజుల్లో వేలాది మంది కార్యకర్తలతో భారీ సభ నిర్వహించి పార్టీ నాయకులు, కార్యకర్తలు కడియం శ్రీహరి చేరికను ఏ విధంగా వ్యతికిరేస్తున్నారో అధిష్ఠానానికి తెలిసే విధంగా సభ నిర్వహిస్తామన్నారు. కార్యకర్తలకు తాను అండగా ఉంటానని ఇందిర హామీ ఇచ్చారు.

## పెద్దపల్లి ఎంపీ సీటును కైవసం చేసుకుంటాం



**వరంగల్ వాయిస్, కాటారం :** రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో పెద్దపల్లి ఎంపీ సీటును కైవసం చేసుకుంటామని బ్లాక్ కాంగ్రెస్ కమిటి అధికార ప్రతినిధి భాస్కర వెంకటరమణ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అరు గ్యారంటీ హామీలను తప్పకుండా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ పథకం పరిధి రూ. 10 లక్షలకు పెంపు, రూ.500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితం హామీలను కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన వంద రోజులలో అమలు చేయడం దేశం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా హామీలను తప్పకుండా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి , మంత్రి శ్రీధర్ బాబుల నాయకత్వంలో పెద్దపల్లి పార్లమెంట్ లోని అన్ని నియోజక వర్గాలు మరింత అభివృద్ధి చెందుతాయని వెల్లడించారు.

# బొడ్డు సునీతకు ఎంపీ టికెట్ ఇవ్వాలి

## పెద్ద ఎత్తున క్రైస్తవుల ప్రదర్శన




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బొడ్డు సునీతకు వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ ఇచ్చే బాధ్యత మీది గెలిపించుకునే బాధ్యత మాదని ట్రై సిటీస్ క్రిస్టియన్ ఫెలో షిప్ ఆధ్వర్యంలో శనివారం కాజీపేట, వరంగల్, హసన్ పర్తి కేంద్రాల నుంచి హనుమకొండలోని బాపిస్ట్ చర్చ్ వరకు రన్ ఫర్ జీసెస్ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున క్రైస్తవులు ప్లకార్డులు పట్టుకొని ఒక్కసారిగా జీసెస్ ఫర్ రన్ వే కార్యక్రమంలో పాల్గొన్నారు. వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ దళిత క్రైస్తవురాలు బొడ్డు సునీతకు కేటాంచాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా నిత్యం ప్రజల మధ్యనే ఉండే మా దళిత క్రైస్తవురాలు బొడ్డు సునీత అని అన్నారు. గత 30 సంవత్సరాల నుంచి వరంగల్ పార్లమెంట్ టికెట్ మహిళలకు దక్కలేదని, కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పని చేస్తూ వస్తున్న బొడ్డు సునీత-అనంద్ కుమార్ సేవలు అధిష్టానం గుర్తించాలని కోరారు. ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ ఓట్లు దాదాపు నాలుగు లక్షలపైగా మించి ఉన్నాయని, ఈ కీలకమైన ఓట్లు అన్ని కూడా బొడ్డు సునీతకు తప్పకుండా పడుతాయని తెలిపారు. కాబట్టి, దళిత క్రైస్తవుల పట్ల కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం మరోసారి ఆలోచించి వరంగల్ పార్లమెంటు ఎంపీ టికెట్ బొడ్డు సునీతకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం దేశ శాంతి కోసం, వరంగల్ ఎంపీ కాంగ్రెస్ పార్టీ టికెట్ బొడ్డు సునీతకు ఇవ్వాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటాకు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన గంట రవికుమార్ ను శనివారం వరంగల్ జిల్లా రంగస్థల పద్య నాటక కళాకారులు ఘనంగా ఆత్మీయ సన్మానం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్ర నూతన సమాజాల సమాఖ్య వరంగల్ కు చెందిన ఆకుల సదానందంను గంట రవికుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవరాజు రవీందర్రావు, మాడిశెట్టి రమేష్, వనపర్తి రాజేంద్రప్రసాద్, సీత, వెంకటేశ్వర్లు, చిన్నబోయిన రామదాసు, పిట్టల కృష్ణ, కుసుమ సుధాకర్, శ్రీ సురభి కొండలరావు, షేక్ మసూద్ అలీ పాల్గొన్నారు.

## కడియం కాంగ్రెస్ పార్టీలోకి రావొద్దు

### ధర్మసాగర్ మండల నాయకులు, కార్యకర్తలు



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మండలంలోని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు వివిధ గ్రామాల నుంచి గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా నిన్న మొన్నటి నుంచి జరిగిన సోషల్ మీడియా ప్రకటనలో ఏఐసీసీ ఆధ్వర్యంలో కడియం శ్రీహరిని ఆహ్వానించినట్లు సమాచారం అందినందుకు స్టేషన్ ఘన పూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ధర్మసాగర్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు అందరూ కూడా ఈ ప్రెస్ మీట్ కు హాజరై కడియం శ్రీహరి చేరికను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. గత 40 సంవత్సరాలుగా రాజకీయాల్లో అనేక విధాలుగా పదవులు అనుభవించిన కడియం, తన స్వార్థం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల్లో పడిపోదుందని చెప్పిన కడియం శ్రీహరిని ఏఐసీసీ ఏ విధంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు పెనుముప్పు పొంచి ఉంటుందన్నారు. కాబట్టి, ఆయన కూతురికి గాని ఎంపీ టికెట్ ఇస్తే మళ్లీ నియోజకవర్గంలో వర్గాలు ఏర్పడడం ఖాయమని తెలియజేశారు. కడియం శ్రీహరి ఒక దళిత ద్రోహి అని, వరంగల్ ఎంపీ సీటు కేవలం దళితులకు మాదిగ సామాజిక వర్గానికి చెందిన సింగపూర్ ఇందిరకు మాత్రమే ఇవ్వాలన్నారు. కానీ, మాదిగ ఉప కులానికి చెందిన కడియం శ్రీహరి కూతురికి ఎంపీ టికెట్ ఇవ్వడం సరైనది కాదన్నారు.

## నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, గోవిందరావుపేట :** నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శనివారం గోవిందరావు పేట మండలంలోని బుస్సాపూర్, దుబ్బగూడెం, తాతయ్యపల్లి గ్రామాల్లో నీటి సరఫరా స్థితిగతులను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామాల్లో పర్యటించి స్థానికులను నీటి సరఫరా తీరును అడిగి తెలుసుకుంటూ ప్రతిరోజు ఎంతసేపు నీరు సరఫరా అవుతుంది ? నీటి సరఫరా తీరును అధికారులు పర్యవేక్షిస్తున్నారా? అని క్షేత్ర స్థాయి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎన్ని నల్లా కనెక్షన్లు ఉన్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరా తీరును స్థానికులను అడిగి తెలుసుకొని నీటి వృథాను అరికట్టాలని, అవసరాల మేరకు నీటిని వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలంలో ఎండల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున గ్రామాలలోని నీటి నిలువలను వృధా చేయకుండా సక్రమంగా ఉపయోగించుకోవాలని కోరారు. ఏటూరు నాగారం మండలం రాంనగర్, వాజేడు మండలంలోని పూసూరు, రామప్ప సరస్సులోని పంపు హౌస్ ల ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలకు తాగునీరు అందించడం జరుగుతుందని తెలిపారు. అధికారుల అంచనాల ప్రకారం ఇప్పటివరకు ములుగు ప్రాంతంలో ఎలాంటి త్రాగునీటి సమస్య లేదని అయినప్పటికీ ప్రజలు త్రాగు నీటని వృధా చేయరాదని నిత్యావసర అవసరాలకు ముడి నీరును ఉపయోగించుకోవాలని కోరారు. గ్రామాలలో ఉన్నటువంటి బోర్ వెల్స్ పనితీరును గ్రామాల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రస్తుతం ఉన్న నీటి వనరులను ఉపయోగించుకుంటూ, గ్రామాల్లో మరమ్మత్తులలో ఉన్న చేతి పంపులు, బోర్లు , మంచినీటి బావులు, తదితర వాటర్ సప్లై వనరులను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ విద్యుత్ నాగేశ్వరరావు, ఆర్ డబ్ల్యూఎస్ అధికారి హజార్ సయ్యద్, గ్రిడ్ అధికారిని సంధ్యారాణి, ఎంపీడీవో జోహార్ రెడ్డి , ఎంపీఓ సాజిదా బేగం, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ వృత్తికే.. సేవకు కాదు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉద్యోగ విరమణ ఉపాధ్యాయ వృత్తికే అని... సేవకు కాదని ప్రభుత్వ అభ్యసన ప్రాథమికోన్నత పాఠశాల, లష్కర్ బజార్ ప్రధానోపాధ్యాయుడు, విధ్వత్ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆముదాల దాత మహర్షి అన్నారు. ప్రభుత్వ అభ్యసన ప్రాథమికోన్నత పాఠశాల లష్కర్ బజార్ ప్రధానోపాధ్యాయుడిగా ఆముదాల దాత మహర్షి ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో స్టాఫ్ సెక్రటరీ బూర సరళ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాత మహర్షి మాట్లాడుతూ తన శేష జీవితాన్ని విద్యారంగంలో జాతీయవాద భావ వ్యాప్తి కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, లష్కర్ బజార్ ప్రధానోపాధ్యాయులు ధర్మయ్య, అతిథులుగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం హనుమకొండ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, సంతోష్ రెడ్డి, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ఇంచార్జి ప్రిన్సిపల్ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఆర్.లక్ష్మణ్, సుధాకర్, రమేష్, భాగ్యలక్ష్మి, రమాదేవి, సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు

## సంకినేని వెంకట్ మాదిగకు సన్మానం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ డిపార్ట్ మెంట్ లోని హెచ్ఓడీగా నియమితులైన కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంకినేని వెంకట్ మాదిగను మర్యాదపూర్వకంగా కలిసి కాకతీయ యూనివర్సిటీ మాదిగ బిడ్డలు డాక్టర్ ధర్మారం నాగయ్య, మంద భాస్కర్ మాదిగలు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అణగారిన వర్గాల బిడ్డలకు చదివే ముఖ్యమని భావించి గ్రామస్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు ఆయన నిరంతరం పోరాడుతూనే ఉన్నాడని వారు అన్నారు. ఆయనకు తను చదువుకున్నయూనివర్సిటీలోనే కాంట్రాక్టు లెక్చరర్ గా పని చేస్తూ పొలిటికల్ సైన్స్ డిపార్ట్ మెంట్ లో హెచ్ ఓడీగా నియమితులైనందుకు వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి శనివారం సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తిస్తూ చట్టం చేయాలి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** భారతదేశంలో 70 శాతం పైగా ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగంగా మార్చి చట్టం చేయాలని తెలంగాణ మేధావుల ఫోరం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర గ్రంధాలయ సంస్థ చైర్మన్, కాంగ్రెస్ మానిఫెస్ట్ కమిటీ సభ్యులుగా నియమించబడిన డాక్టర్ ఎండీ రియాజ్ ను తెలంగాణ మేధావుల ఫోరం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె వీరాస్వామి నాయకత్వంలో శనివారం హనుమకొండ జిల్లా కేంద్రం ఎక్సైజ్ కాలనీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్ప గుచ్ఛంతో సత్కరించి అభినందనలు తెలిపిన సందర్భంగా వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగంగా చట్టం చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ తెలంగాణ మేధావుల ఫోరం అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ చేతిలో ఆగమైన తెలంగాణ అనే పుస్తకాన్ని ముద్రించి టీపీసీసీ అధ్యక్షుడైన రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారని తెలిపారు. దేశ రైతుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే వ్యవసాయ రంగానికి శాశ్వత పరిష్కారం చూపిస్తున్న అంశాన్ని ఆల్ ఇండియా కాంగ్రెస్ మానిఫెస్టో కమిటీకి వివరించి కాంగ్రెస్ తరపున రైతులకు న్యాయం చేసే ప్రయత్నం చేస్తానని అన్నారు. మేధావుల ఫోరం సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి, కోశాధికారి అక్కినపల్లి వెంకటేశ్వర్లు, కమిటి సభ్యులైన డాక్టర్ సంజీవ్, సాయిని నరేందర్ పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్

## వేరే చోటుకు మార్చాలని వినతి



**వరంగల్ వాయిస్, కాటారం :** మండలంలోని రేగుల గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని బూడిదపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్ ను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో కన్వీనర్ మొగిలి రాజ్ కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం కాటారం మండలం విద్యుత్తు ఏఈ మేఘనాథ్ కు వినతిపత్రం సమర్పించారు. పాఠశాల ఆవరణలో ప్రాథమిక పాఠశాలతో పాటు అంగన్వాడీ సెంటర్ ఉండడం, అందులోని పిల్లలు మైదానంలో ఆడుకుంటూ ఉండే ప్రాంతంలో రైతులకు సంబంధించిన విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్ కు కంచె కూడా లేకపోవడంతో ప్రమాదకరంగా ఉందని ఆయన వివరించారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కు ఉన్నటువంటి స్తంభాలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో పిల్లలతో పాటు ఊరిలోని పశువులు, గొర్రెలు, మేకలు మేతకు ఈ ప్రాంతంలో సంచరిస్తాయని, అనుకోని ప్రమాదం విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్ వల్ల జరిగే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్ తీగలకు మనుషులు, పశు వులు సైతం మృత్యువాత పడ్డాయని, ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని వీలైనంత త్వరగా పాఠశాల నుంచి తొలగించి మరో చోటుకు వంద మీటర్ల దూరంలో విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్ ను సురక్షిత ప్రాంతంలో ఏర్పాటు చేయాలని మొగిలి రాజ్ కుమార్ కోరారు.

# లైన్‌మెన్ కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన ట్రాన్స్ కో లైన్ మెన్ బర్మ రవి కురుమ ఇటీవల విద్యుత్ షాక్ తో మృతి చెందిన విషయం తెలిసిందే... శనివారం ఆయన స్నేహితులు ట్రాన్స్ కో ఏడీ ఏసీ హెచ్ శ్రీధర్, వేణు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి తదితరులు ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా ఆ కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం కల్పించేందుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. మంచి స్నేహితుడిని కోల్పోవడం బాధాకరమైన విషయమని ఆయన అన్నారు.

# సంపద పెంచుకోవడానికే కాంగ్రెస్‌లోకి కడియం



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** జఫర్ గఢ్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి చేరడం కేవలం సంపద పెంచుకోవడానికేనని జఫర్ గఢ్ కాంగ్రెస్ మండల నాయకులు విమర్శించారు. గత 40 ఏళ్లుగా నిన్ను ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సామాన్యుల ప్రాణాలు తీసిన మీరు , కాంగ్రెస్ పార్టీ లోకి ఎలా వస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి నేను పుట్టినప్పటి నుంచి ఓటు వెయ్యలేదు అన్న నువ్వు సిగ్గు లేకుండా ఎలా వస్తున్నావన్నారు. కాంగ్రెస్ పార్టీ మీద నమ్మకంతో అధికారంలో లేకున్నా మేము కాంగ్రెస్ పార్టీ జెండానే దించకుండా మోశామని తెలిపారు. ఈ రోజు మాకు కానీ, మా కోసం వచ్చి ధైర్యంగా ముందుండి నడిపించిన సింగపురం ఇందిరకు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కానీ, మాకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి ఏండ్ల వెంకటయ్య, సోషల్ మీడియా నియోజకవర్గ ఇంచార్జి, జఫర్ గఢ్ మండల అధికార ప్రతినిధి ఎండీ ముక్తార్ ఆలీ, సాగరం ఎంపీటీసీ రంజిత బాషా, మాజీ మండల అధ్యక్షుడు చిట్టిమల్లు కృష్ణ మూర్తి, మండల నాయకులు కూరపాటి విజయ్, కూనుర్ గ్రామ శాఖ దాట్ల అశోక్, జఫర్ గఢ్ గ్రామ శాఖ నీలం రాజయ్య, తిడుగు గ్రామ శాఖ వాసం యాకయ్య, కొప్పుల జనార్ధన్, రఘునాథ్ పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు మర్రి సుదీర్ రెడ్డి, ఐ తమ్మడపల్లి అధ్యక్షుడు బుల్లె పరుశురాములు, శీను ,దావిద్, రాజేంద్రప్రసాద్, హరిబాబు ,బాస్కర్,టేకుమట్ల అయిలయ్య, కార్యకర్తలు, జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

# కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. పరకాల నియోజకవర్గ కేంద్రంలోని ఎఫ్.జె గార్డెన్స్ లో శనివారం ఉదయం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పరకాల బీఆర్ఎస్ కార్యకర్తలను, నేతలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, అన్నివేళాల అండగా ఉంటానని, ఎవరూ ఆధైర్యపడవద్దని భరోసా కల్పించారు. ఎవరికి అధికారం శాశ్వతం కాదన్నారు. ఎవరెన్ని అక్రమ కేసులు పెట్టినా, వేధించిన పార్టీలోనే ఉందామన్నారు. వందరోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని మండిపడ్డారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ప్రజల తరపున ఎన్నికల హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ పై కొట్లాడుదామని పిలుపునిచ్చారు. పదేండ్లలో తెలంగాణలో ఏ ఒక్కరోజు రైతన్నల ఆత్మహత్యలు జరిగిన సంఘటనలు లేవు, మూడు నెలల్లోనే రైతన్నల ఆత్మహత్యలు., ఆటో డ్రైవర్స్ ఆత్మహత్యలు, నీళ్లు లేక పంటపొలాలు ఎండిపోతున్నాయని విమర్శించారు. పరిపాలనను గాలికి వదిలేసి బీఆర్ఎస్ నేతలను ఎమ్మెల్యేలను కొనే పనిలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని ఎద్దేవా చేశారు. కొందరు పదేండ్లు అధికారాన్ని అనుభవించి, ఎమ్మెల్యేలుగా ఉండి ఇప్పుడు అధికార కాంక్షకోసం, పదవుల కోసం పార్టీలు మారుతున్నారు. ఏడాదిలోనే కాంగ్రెస్ లోనే సంక్షోభం ఏర్పడుతుందని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. ప్రజల సమస్యలను గాలికొదిలేసి బీఆర్ఎస్ నేతలపై, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధించడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. పదేండ్లలో మేము ప్రజల కోసం తప్పా ప్రతిపక్ష పార్టీల నేతలను కానీ కార్యకర్తలను కానీ వేధించిన సంఘటనలు లేవన్నారు. తాను పార్టీ మారుతున్నానని కొంత మంది ప్రచారం చేస్తున్నారు.. అలాంటివి మానుకోవాలని హెచ్చరించారు.

### బీఆర్ఎస్‌లో చేరిన మోరే రాజేందర్..

పరకాల పట్టణంలోని 5వ డివిజన్ కి చెందిన మోరె రాజేందర్ కాంగ్రెస్ పార్టీని వీడి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో తిరిగి బీఆర్ఎస్లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి చల్లా ధర్మారెడ్డి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మి ఆ పార్టీలో చేరి తప్పు చేశానన్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు, పాలన నచ్చకనే తిరిగి బీఆర్ఎస్ లో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ పార్టీలో భారీ చేరికలు



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** నియోజకవర్గం పరిధిలోని ఇరవెన్ని గ్రామ ఎంపీటీసీ కొడిశాల యాదగిరి, సొసైటీ డైరక్టర్ గాదరి కాంతమ్మ, మాజీ ఎంపీటీసీ అనుముల ఎల్లయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ముస్కు ఉపల్లయ్య వీరితో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీ పార్టీలో చేరారు. వీరికి బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ మురళీధర్ గౌడ్, రాష్ట పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు, జనగాం జిల్లా అధ్యక్షుడు దశమంత రెడ్డిలతో కలిసి వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా నాకు ఈ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజానీకానికి సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అహర్నిశలు తన గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. పాలకుర్తి నియోజకవర్గం నుంచి బీజేపీకి అత్యధిక మెజారిటీ వచ్చే విధంగా ప్రణాళికలు సిద్దం చేసుకొని ముందుకు వెళ్లాలని నాయకులను, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. పార్టీలో చేరిన వారిలో గాదరి ఉపేందర్, ఆనంద్, పోషయ్య, కొమురయ్య, దామోదర్, సురేష్, జనార్దన్, అనిల్, హర్షిత్, వెంకన్న, అరవింద్, ఎల్లయ్య తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, మండల పార్టీ అధ్యక్షుడు సంపత్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాన్నమియా తోటలో హోమాలు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నాన్నమియా తోటలో శనివారం భూలక్ష్మి శ్రీలక్ష్మి బొడ్రాయి నాభిశీల ప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. బొడ్రాయి ప్రతిష్ఠాన కార్యక్రమంలో భాగంగా మహా హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ నగర ప్రజలు కాలనీ ప్రజలు దంపతులతో విచ్చేసి హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి హాజరయ్యారు.

# దయాశీలకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, మామునూరు :** నాలుగవ బెటాలియన్‌లో రిజర్వ్ ఇన్ స్పెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్న పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ దయాశీలని శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ దయాశీల నాలుగో బెటాలియన్ లో తన ఉద్యోగ ప్రస్థానాన్ని కానిస్టేబుల్ గా మొదలుపెట్టి వివిధ బెటాలియన్లలో వివిధ హోదాలలో పని చేశారన్నారు. విధి నిర్వహణలో వారు చేసిన సేవలకు పోలీసు వ్యవస్థలో అత్యున్నత పథకమైన ఇండియన్ పోలీస్ మెడల్ తో పాటు ఎన్నో పథకాలు అందుకున్నాడని, వారు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఎంతో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారని, వారి శేష జీవితం సుఖమయంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణ ప్రసాద్, శ్రీనివాస్ రావు, వీరన్న , రిజర్వ్ ఇన్ స్పెక్టర్లు శోభన్, రాజిరెడ్డి, రమేష్, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రన్న, రాజ్ కుమార్, అశోక్, కృష్ణ, అధికారులు, మినిస్ట్రీయల్ స్టాప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్య మిత్రురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని రాయపర్తి గ్రామానికి చెందిన కూరాకుల వరలక్ష్మి కుమారుడు కూరాకుల నితిన్ గత వారం రోజుల క్రితం ఆర్థిక ఇబ్బందుల వల్ల మరణించడం జరిగింది. బాల్యం నుంచి తమతో సీఎస్ఐ మిషన్ హైస్కూల్లో చదువుకున్న మిత్రురాలికి ఇద్దరు అమ్మాయిలు, ఒక కుమారుడు సంతానం ఉండగా కుమారుడు చనిపోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. ఈ సందర్భంగా మిత్రురాలి ఎదిగిన కొడుకు చనిపోవడం చాలా బాధాకరమని, బాల్య మిత్రులందరూ కలిసి శనివారం రాయపర్తి గ్రామంలోని వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని సానుభూతి తెలియజేస్తూ రూ.22 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల్య మిత్రులు బొల్లపల్లి రఘురాం, బొచ్చు నాగరాజు, బొమ్మకంటి చంద్రమౌళి, సుధమల్ల అనిల్, బొచ్చు కరుణాకర్, మడికొండ రామ్మూర్తి, లక్ష్మి, శ్యామల, సరిత పాల్గొన్నారు.

# ముందస్తు జాగ్రత్తలతో మండు వేసవిని అధిగమిద్దాం

## కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ముందస్తు జాగ్రత్తలతో మండు వేసవిని అధిగమిద్దామని, ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో వేసవి వడగాల్పులు, వడదెబ్బ, ముందస్తు జాగ్రత్త చర్యల జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ తో కలిసి జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, దీనిపై ప్రజలు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. అందులో భాగంగా మునిసిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో అన్ని మునిసిపాలిటీలల్లో స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఏ.ఎన్.ఎం.లతో సమన్వయం చేసుకుని వడగాల్పులపై ప్రజలకు అవగాహన కల్పించేలా, అలాగే తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వేసవిలో విద్యుత్ అవసరం అధికంగా ఉంటుంది కాబట్టి, అందుకు కావలసిన చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతంలో షెడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని గ్రామీణాభివృద్ధి అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సదుపాయానికి ఎలాంటి కొరత లేకుండా ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వడగాల్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అటవీ పరిసర ప్రాంతాల్లో వన్యప్రాణులకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా.. అక్కడక్కడా నీటి తొట్టెలు ఏర్పటు చేసి నీరు నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని అటవీశాఖాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రమాదేవి, మహబూబాబాద్,తొర్రూరు ఆర్డీఓలు అలివేలు, నరసింగరావు, సీపీఓ సుబ్బారావు, డీహెచ్ఎస్ఓ మరియన్న, డీపీఓ హరిప్రసాద్, అడిషనల్ డీఆర్డీఓ శాంతకుమారి, డీపీఓ అభిమన్యుడు, విద్యుత్ అధికారి నరేష్, ఆర్అండ్ బీ ఈఈ తానేశ్వర్, మహబూబాబాద్, గూడూరు అటవీ డివిజనల్ అధికారులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ పాలనలో విద్యారంగం విధ్వంసం

## రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ 10 సంవత్సరాల పాలనలో దేశ విద్యారంగం పూర్తి విధ్వంసానికి గురైందని, ఫలితంగా దళిత గిరిజన బడుగు, బలహీన, ముస్లిం, మైనారిటీ వర్గాల విద్యార్థులు విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, విద్యా రంగాన్ని పరిరక్షించుకోవడానికి వామపక్ష, బహుజన విద్యార్థి, లౌకిక, ప్రజాస్వామిక శక్తులు ఐక్యంగా పోరాడాలని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. శనివారం కాకతీయ యూనివర్సిటీలోని ఎకనామిక్స్ విభాగంలో వామపక్ష ,బహుజన విద్యార్థి సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి అదానీ, అంబానీ లాంటి ప్రైవేట్, కార్పొరేట్ల అభివృద్ధి పట్ల ఉన్న ఆసక్తి, ప్రభుత్వ విద్యా రంగ అభివృద్ధి పట్ల లేదన్నారు. దేశంలోని విద్యార్థి, యువతకు విద్య, ఉద్యోగ ,ఉపాధి అవకాశాలు కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యా రంగంలో మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు దేశ విద్య వ్యవస్థను పూర్తిగా కాషాయీకరించే విధంగా ఉన్నదని తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 అమలు ఫలితంగా విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం కొరవడి, కుల, మత విద్వేషాలు రగిలే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో కూడిన ప్రశ్నించే తత్వాన్ని, ప్రజాస్వామిక లక్షణాలను అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయక రెడ్డి, ఓయూ ప్రొఫెసర్ పద్మజాషా, సోషల్ డెమోక్రటిక్ ఫోరం రాష్ట్ర నాయకులు పృథ్వీ, సామాజిక ఉద్యమకారిణి నిర్మల, పీడీఎస్ యూ రాష్ట్ర కార్యదర్శి పి.మహేష్, ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీల ఇంచార్జి రెహమాన్, పీడీఎస్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి వెంకటరెడ్డి, పీడీఎస్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నరసింహారావు, ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంద నరేష్, బీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు శివకుమార్, టీవీవీ కార్యదర్శి గణేష్, ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల ప్రసన్నకుమార్, వామపక్ష ,బహుజన విద్యార్థి సంఘాల నాయకులు రంజిత్, మహేష్, స్టాలిన్, సాయి కిరణ్, పృథ్వీ, రత్నం, సృజన్, రమేష్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో



**వరంగల్ వాయిస్, పరకాల :** ఏఐసీసీ పిలుపు మేరకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీపై కక్షపూరితగా కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింప చేసి పార్లమెంటు ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయాలని చూస్తున్న బీజేపీ ప్రభుత్వానికి నిరసనగా పరకాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలి నుంచి పాత ఏటీఎం సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి అనంతరం రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నాయకులు పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతితో పాటు పరకాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింప చేసి పార్లమెంటు ఎలక్షన్లో లబ్ధి పొందాలని చూస్తుందన్నారు. ప్రజలు ఈ అరాచక పాలనను చూస్తున్నారని, ఈ పార్లమెంటు ఎలక్షన్లో ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్తారని తెలిపారు. ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధిక మెజార్టీతో గెలుపొందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ కాంగ్రెస్ కమిటీ మండల కాంగ్రెస్ కమిటీ, కౌన్సిలర్లు, సమన్వయకర్తలు, సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో దుద్దిళ్ల శ్రీనుబాబు



**వరంగల్ వాయిస్, కాటారం :** మండలంలోని చిదినపల్లి గ్రామంలో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహోదరుడు, శ్రీపాద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీను బాబు పాల్గొన్నారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు కాటారం మండల పరిషత్ అధ్యక్షుడు సంతకాని సమ్మయ్య, ఎంపీటీసీల ఫోరం కన్వీనర్ రవీందర్ రావు, మంథని డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎరవెల్లి విలాస్ రావు, కాటారం మాజీ ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్, సోషల్ మీడియా ఇంచార్జి ఆరేళ్ల కిరణ్ గౌడ్, రాజు నాయక్, యూత్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుద్దిళ్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఆధ్యాత్మిక ప్రతి ఒక్కరిలో పరిడవిల్లాలని, తద్వారా గ్రామంలో ప్రశాంత వాతావరణ నెలకొంటుందని, పాడిపంటలతో సుఖ సంతోషాలతో ప్రజలు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ మాలా ధారణ భక్తులతో కలిసి ఆలయ ప్రాంగణంలో ప్రజలతో ముచ్చటించారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్

## ప్రిన్సిపాల్ ఎస్ ధర్మేంద్ర



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ ధర్మేంద్ర అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ ధర్మేంద్ర అధ్వర్యంలో కళాశాల అధ్యాపకులకు ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఐ ఈఓ గోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎస్ ధర్మేంద్ర మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వంగా తమ కళాశాలలో సర్వమత కులాలకు చెందిన అధ్యాపకులు సమిష్టిగా కలిసి మెలిసి ఉంటూ విద్యార్థులకు విద్యా బోధన చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. భారతదేశం సర్వ మత సాంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. అధ్యాపకులకు రంజాన్ మాసం, గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అధ్యాపకులతో కలిసి ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు మాధవి, తెలంగాణ రాష్ట్ర లెక్చరర్స్ అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** గ్రామాలలో మంచినీటి సరఫరాలో ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే అందుకు ప్రత్యామ్నయంగా తాగునీరు అందించడానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వేసవిలో త్రాగు నీటి ఎద్దడి నివారణకు చేపట్టిన చర్యలు, వివిధ దశలలో ఉన్న పనుల పురోగతి పై ఆర్ డబ్ల్యూఎస్, గ్రిడ్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలతో గ్రామ పంచాయతీల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ జిల్లాలోని 241 గ్రామ పంచాయతీలలో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. సుదీర్ఘ సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గ్రామ పంచాయతీ వారీగా పంచాయతీ రాజ్, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులను మంచినీటి సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో మరమ్మత్తులలో ఉన్న బోర్లు, చేతి పంపులు, మంచినీటి పైపులైన్ల లీకేజి మరమ్మత్తులు, నూతన పైపు లైన్ల నిర్మాణానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్ డీఎఫ్) డీఎంఎఫ్ టీ నిధుల నుంచి అన్ని గ్రామ పంచాయతీలకు రూ. 3.91 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మంచినీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి పంచాయతీ రాజ్, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు అందచేసిన నివేదికలు ఆధారంగానే నిధులు మంజూరు చేశామని అన్నారు. ఎక్కడైనా మంచినీటి సరఫరాలో ఇబ్బంది వస్తే తక్షణమే తన దృష్టికి తేవాలని తెలిపారు. మంచినీటి వనరులు మాత్రమే కాకుండా ప్రైవేటు బోర్లు, బావుల ద్వారా గ్రామాలలో నీటిని అందించడానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామాలలో మరమ్మతులు జరుగుతున్న బోర్లు, చేతి పంపులను ఏప్రిల్ 4 వరకు పూర్తి చేసి నివేదికలు అందజేయాలని, ఎక్కడైనా మరమ్మత్తులు పూర్తికాకపోతే అందుకు కారణాలను ఎంపీడీఓ, ఆర్ డబ్ల్యూఎస్ సిబ్బంది సంయుక్తంగా ధ్రువీకరణతో నివేదికలు అందచేయాలని ఆదేశించారు. వేసవి కాలం ముగిసేంత వరకు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎక్కడా తాగునీటికి ఇబ్బంది రావొద్దని ఆయన పేర్కొన్నారు. పురోగతిలో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని, మరమ్మత్తులకు వినియోగించే సామగ్రి నాణ్యత ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జడ్పీ సీఈఓ విజయలక్ష్మి, ఆర్ డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, డీపీఓ నారాయణరావుతో పాటు మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దండయాత్రకు రెడీ



టాలీవుడ్ హీరో విశ్వక్‌సేన్ నటిస్తున్న తాజా చిత్రాల్లో ఒకటి విశ్వక్ సేన్ 10. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్నాడు. విశ్వక్‌సేన్ చేతిలో పానను పట్టుకొని పైకి చూపిస్తున్న స్టిల్‌తో ఇప్పటికే అప్‌డేట్ అందించారు మేకర్స్. శుక్రవారం విశ్వక్‌సేన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మూవీకి మెకానిక్ రాకీ టైటిల్‌ను ఫైనల్ చేశారు.తాజా టైటిల్ లుక్ చూస్తుంటే మాస్ కా దాస్ తనలోని ఫన్ యాంగిల్‌తో ఈ సారి బాక్సాఫీస్ గట్టిగానే దండయాత్ర చేసేందుకు రెడీ అవుతున్నట్టు అర్థమవుతోందంటున్నారు సినీ జనాలు. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. హై ఫోర్స్ ఇంజిన్ త్వరలోనే షురూ అవుతుంది..ఫన్ రైడ్ కోసం రెడీగా ఉండండి.. అంటూ రిలీజ్ చేసిన పోస్టర్లకు మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రాన్ని ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తల్లూరి నిర్మిస్తుండగా.. జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. విశ్వక్ సేన్ దీంతోపాటు ఛల్ మోహన్ రంగ ఫేం కృష్ణ చైతన్య దర్శకత్వంలో విశ్వక్ సేన్ 11వ సినిమాగా వస్తున్న గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి లో నటిస్తున్నాడు. ఈ ప్రాజెక్ట్‌ను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార సంస్థ బ్యానర్‌తో కలిసి ఫార్చ్యూన్ ఫోర్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు. నేహా శెట్టి, అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు. మరోవైపు రామ్ నారాయణ్ దర్శకత్వంలో 12 చిత్రంలో నటిస్తున్నాడు.



# అదే తరహాలో.. డిజె టిల్లు

## లిప్‌లాక్‌లతో కట్టిపడేసిన అనుపమ


సిద్ధు జొన్నలగడ్డ, అనుపమ పరమేశ్వర్ జంటగా నటించిన రొమాంటిక్ క్రైమ్ కామెడీ టిల్లు స్క్వేర్. 'డీజే టిల్లు' చిత్రంతో ఒక్కసారిగా సినీప్రియుల్లో భారీ క్రేజ్ సంపాదించుకున్నాడు సిద్ధు జొన్నలగడ్డ. రాధిక (నేహాశెట్టి)తో పాత పంచాయితీ ముగిశాక టిల్లు (సిద్ధు జొన్నలగడ్డ) సొంతంగా ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ప్రారంభిస్తాడు. పాత గొడవలన్నీ మర్చిపోయి మళ్లీ తనదైన శైలిలో సరదాగా జీవితాన్ని కొనసాగించే ప్రయత్నం చేస్తుంటాడు. సరిగ్గా అప్పుడే అతని జీవితంలోకి లిల్లీ (అనుపమ పరమేశ్వరన్) అనే మరో అందమైన అమ్మాయి ప్రవేశిస్తుంది. వాళ్లిద్దరూ అనుకోకుండా ఓ పబ్‌లో కలుసుకుంటారు. ముందు టిల్లు ఆమెతో మాట కలుపుతాడు. అతడి మాటలు.. వ్యవహారశైలి నచ్చి ఆమె తనతో పెదవి కలుపుతుంది. అంతే.. అదే రాత్రి ఇద్దరూ ఒక్కటవుతారు. కట్ చేస్తే తెల్లారేసరికి గదిలో ఒక లెటర్ పెట్టి లిల్లీ అక్కడ్నుంచి వెళ్లిపోతుంది. కానీ, ఆ ఒక్క పూటలోనే ఆమెను మనసంతా నింపేసుకున్న టిల్లు ఆ ఆలోచనలతో పిచ్చివాడైపోతాడు. ఆమెను వెతికి పట్టుకోవడం కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తాడు. ఈ క్రమంలో నెల తర్వాత లిల్లీ ఓ ఆస్పత్రిలో టిల్లుకు ఎదురుపడుతుంది. తను గర్భవతినని చెప్పడంతో టిల్లు షాకవుతాడు. ఆ తర్వాత తనని పెళ్లి చేసుకుంటానని చెప్పి ఇంటికి తీసుకొస్తాడు. ఈలోపు మళ్లీ టిల్లు పుట్టినరోజు వస్తుంది. ఆరోజు లిల్లీ అతన్ని తన అపార్ట్‌మెంట్‌కు రావాలని కోరడంతో తను అక్కడికి వెళ్తాడు. తీరా చూస్తే అది రాధిక (నేహా శెట్టి) ప్లాట్. మరి అక్కడికి వెళ్లాక టిల్లుకు ఎదురైన సమస్య ఏంటి? రాధిక, లిల్లీకి మధ్య ఉన్న సంబంధం ఏంటి? దుబాయ్ నుంచి వస్తున్న మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ షేక్ మహబూబ్ (మురళీశర్మ)కు ఈ కథకు ఉన్న లింకేంటి? అతన్ని చంపాల్సిన మిషన్‌లోకి టిల్లు ఎందుకొచ్చాడు? అన్నది మిగతా కథ. ఇక టిల్లు తన బర్త్‌డే పార్టీని వదిలేసి లిల్లీని వెతుక్కుంటూ పాత రాధిక అపార్ట్‌మెంట్‌కే వెళ్లడం.. ఆరోజు చేదు జ్ఞాపకాల్ని గుర్తు చేస్తూ మళ్లీ అదే సమస్యలోకి దిగడం ఆసక్తిరేకెత్తిస్తుంది. ఆ తర్వాత నుంచే ఈ కథలో కొత్త కోణం బయటకొస్తుంది.  ఇక ద్వితీయార్థం షేక్ మహబూబ్ అలీని పట్టుకునే మిషన్ నేపథ్యంలో సాగుతుంది. అంత పెద్ద క్రిమినల్‌ను చంపడానికి టిల్లులాంటి సాధారణ వ్యక్తితో ఎలాంటి సాహసాలు చేయిస్తారన్న ఆసక్తి అందరిలోనూ కలుగుతుంది. నిజానికి ఆ ప్రయత్నం మరీ అంత థ్రిల్లింగ్‌గా సాగకున్నా ఎక్కడా బోర్ కొట్టించదు. టిల్లు పాత్రలో సిద్ధు జొన్నలగడ్డ తనదైన నటనతో మరోసారి కట్టిపడేశాడు. లిల్లీ పాత్రలో అనుపమ తెరపై చాలా హాట్‌గా కనిపించింది. లిప్‌లాక్‌ల విషయంలో మొహమాట పడకుండా నటించింది. టిల్లు తల్లిదండ్రుల పాత్రలూ నవ్వులు పంచాయి. రాధిక పాత్రలో నేహా శెట్టి అతిథిలా తళుక్కున మెరిసింది. అలాగే ప్రియాంక జవాల్కర్ కూడా ఓ చిన్న పాత్రలో మెరిసింది. సినిమాలోని రెండు పాటలు తెరపైనా కనువిందు చేస్తాయి. భీమ్స్ నేపథ్య సంగీతం చక్కగా కుదిరింది. కూర్పు బాగా కుదిరింది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి.

# వరుస సినిమాలతో బిజీగా సూర్య

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ప్రస్తుతం శివ దర్శకత్వంలో కంగువ సినిమా చేస్తుండగా.. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. కాగా మరోవైపు ఆకాశం నీ హద్దురా ఫేమ్ సుధా కొంగరతో సూర్య43కి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. దీనికి సంబంధించిన అప్‌డేట్ రావాల్సి ఉంది. కాగా ఈ రెండు ప్రాజెక్టులు లైన్‌లో ఉండగానే
తమిళ సూపర్ స్టార్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు తో సూర్య 44 సినిమా చేసేందుకు ఓకే చెప్పాడు సూర్య. తాజాగా ఈ ఇంట్రెస్టింగ్ సినిమాకు సంబంధించిన కొత్త అప్‌డేట్ తెరపైకి వచ్చింది. ఈ మూవీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అశోక్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు తక్కువ సమయంలోనే ఓకే అయింది. ఈ మూవీ షూటింగ్ త్వరలోనే షురూ కానుంది. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణులను కార్తీక్ సుబ్బరాజు ÷నైల్ చేస్తారని చెప్పారు. అంతేకాదు తాజా టాక్ ప్రకారం సూర్య 44 మల్టీస్టారర్‌గా వచ్చే అవకాశాలున్నాయి. సినిమా స్లాట్‌ను కార్తీక్ సుబ్బరాజు ఇప్పటికే సిద్దం చేశాడట. ఈ చిత్రాన్ని 2025 పొంగళ్ కానుకగా విడుదల చేసేందుకు ఎ÷-లాన్ చేస్తున్నట్టు ఇన్‌సైడ్ టాక్. సూర్య 44 ఏ జోనర్‌లో రాబోతుందనే దానిపై రాబోయే రోజుల్లో క్లారిటీ రానుందని సమాచారం. సూర్య44 సినిమాను సూర్య హోంబ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించనున్నట్టు సమాచారం. మరోవైపు ఇప్పటికే లాంఛ్ చేసిన కంగువ గ్లింప్స్ వీడియో, పోస్టర్లు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. సూర్య, బాబీడియోల్ పోటీ పడి మరీ తమలోని కొత్త యాంగిల్‌ను పరిచయం చేయబోతున్నట్టు గూస్ బంప్స్ తెప్పించే యాక్షన్ సన్నివేశాలతో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్.

# నటులు ఎక్కడైనా నటులే కదా





సౌత్ ఇండస్ట్రీ వర్సెస్ బాలీవుడ్ అనే చర్చ సినీ పరిశ్రమలో ఎప్పుడూ ఉంటుంది. ఇప్పటికే పలువురు తారలు ఈవిషయంపై స్పందించారు. తాజాగా నటి ప్రియమణి ఈ అంశంపై స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈ వ్యాఖ్యలపై కొందరు నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం దక్షిణాది నటీనటులు అన్ని భాషల్లోనూ సత్తా చాటుతున్నారు. సౌత్ ఇండియాకు సంబంధించిన పాత్ర కాబట్టి మీకు అవకాశమిస్తు న్నామని కొందరు బాలీవుడ్ దర్శకులు అంటుంటారు. త్వరలోనే ఈ ధోరణిలోనూ మార్పు రావాలని కోరుకుంటున్నా. మేము ఇక్కడి వాళ్లమే అయినా.. హిందీ భాషను అనర్గళంగా మాట్లాడగలం. అంతేకాదు అందంగా కూడా ఉంటాం. కాకపోతే మా రంగు నార్త్ వాళ్లంత ఫెయిర్‌గా ఉండదంతే. కానీ అది పెద్ద విషయమేమీ కాదు. సౌత్ నుంచి వచ్చే నటీనటులకు అన్ని భాషలపైనా అవగాహన ఉంటుంది. డైలాగులు చెప్పేటప్పుడు గ్లామర్ తప్పులు ఉన్నా.. భావోద్వేగాలను సరిగ్గా పండిస్తాం. అయినా.. నార్త్, సౌత్ అని వ్యత్యాసం చూడకూడదు. అందరూ భారతీయ నటీనటులే' అని అన్నారు. ఇక ప్రియమణి ప్రస్తుతం బాలీవుడ్‌లో బిజీ అయ్యారు. గతేడాది రెండు సూపర్ హిట్లు అందుకున్న ఆమె ప్రస్తుతం 'మైదాన్' కోసం ఎదురుచూస్తున్నారు. బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రమిది. భారత దిగ్గజ ఫుట్‌బాల్ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీం జీవితం ఆధారంగా అమిత్‌శర్మ దీనిని తెరకెక్కించారు. జీ స్టూడియోస్, బోనీకపూర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఓడిపోయే పార్టీ నుంచి టికెట్ వద్దనుకున్నాం..

# అందుకే తిరస్కరించాం..

**నా బిడ్డను మీ చేతుల్లో పెడుతున్నా**

**నన్ను ఆశీర్వదించినట్లే నా కూతురును ఆశీర్వదించాలి**

**నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కడియం శ్రీహరి**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మొదటిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న కడియం కావ్యను ఓడిపోయే పార్టీ నుంచి బరిలోకి దించడం వద్దనుకున్నాం..అందుకే బీఆర్ ఎస్ టికెట్ ను తిరస్కరించామని మాజీ మంత్రి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన వాఖ్యలు చేశారు. ఎవరిని అడగకుండానే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. హైదరాబాద్ బంజార హిల్స్ రోడ్ నెం 12 మినిస్టర్స్ క్వార్టర్స్ లోని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో శనివారం నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కడియం శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఒక్కరూ కడియం శ్రీహరి ఏ నిర్ణయం తీసుకున్నా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ముక్త కంఠంతో నినదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం ఒడిదుడుకులను ఎదుర్కొంటుందన్నారు. దీంతో పార్టీ శ్రేణులు అయోమయంలో ఉన్నారన్నారు. అరూరి రమేష్ వద్దంటేనే కడియం కావ్యకు టికెట్ కేటాయించారని గుర్తు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలా మంది నాయకులు పార్టీని వీడడంతో బీఆర్ఎస్ బలహీన పడిందన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని ఇంకా ఎంతో అభివృద్ధి చేసుకోవాల్సి ఉంది. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవాల్సి ఉంది. నియోజకవర్గ నాయకులు పెద్ద మనసుతో మమ్మల్ని క్షమించాలి. పదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ నా వెంట ఉన్న నాయకులు, కార్యకర్తలు ప్రతిపక్షంలో ఉన్నట్లుగానే ఉన్నారన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయమని పిలుపు వస్తుంది. ఏఐసీసీ ప్రతినిధులు, పీసీసీ ప్రతినిధులు వచ్చి కాంగ్రెస్ లోకి ఆహ్వానించారు. మా నియోజకవర్గ నాయకులను, కార్యకర్తలను అడిగిన తర్వాతే నిర్ణయం చెబుతానని చెప్పాను. మీ అందరి అభిప్రాయం మేరకే నా నిర్ణయం ఉంటుందన్నారు. మీ అందరి సహకారంతోనే నేను ముందుకు వెళ్తానన్నారు. తాటికొండ రాజయ్య, అరూరి రమేష్, పసునూరి దయాకర్ పార్టీ మారినప్పుడు ఎవరూ మాట్లాడలేదు. కానీ ఇప్పుడు అందరూ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ స్థాయిలో విమర్శలు ఎందుకు చేస్తున్నారో అర్థం చేసుకోవాలన్నారు. ఎంత ఎక్కువ విమర్శలు వస్తే అంత ఎక్కువ బలం ఉందని అర్థం చేసుకోవాలన్నారు. అవకాశలు అందరికి వస్తాయి..కానీ వచ్చిన అవకాశాలను ఏవిధంగా ఉపయోగించుకున్నాం అనేదే ముఖ్యమన్నారు. కొంత మంది నెలల తరబడి పార్టీలో చేరతామని వాళ్ల ఇళ్ల చుట్టూ తిరిగారు అయినా చేర్చుకోలేదు. కానీ వాళ్లే మన ఇంటికి వచ్చి పార్టీలో చేరమని అడుగుతున్నారు. కొంత మంది వచ్చిన అవకాశాలను చెడగొట్టుకొని ఎదుటి వాళ్లపై విమర్శలు చేస్తున్నారన్నారు. నా 10సంవత్సరాల బీఆర్ఎస్ ప్రస్థానంలో ఒక్క తప్పు కూడా చేయలేదు. ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదన్నారు. రియల్ ఎస్టేట్, భూ కబ్జాలు చేయలేదు. నేను ప్రైవేట్ యూనివర్సిటీలు పెట్టుకోలేదు. నన్ను విమర్శించే నైతిక అర్హత స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ ప్రజలకు తప్ప ఏ ఒక్కరికీ లేదన్నారు. 30సంవత్సరాల నా రాజకీయ జీవితంలో నాపై ఒక్క కేసు కూడా లేదన్నారు. చాలా మంది పార్టీని, ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని విచ్చలవిడిగా ఆస్తులు కూడబెట్టుకున్నారని విమర్శించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు నేను జీవితాంతం రుణ పడి ఉంటాను. నన్ను ఆశీర్వదించినట్లే నా కూతురును ఆశీర్వదించాలి. నా బిడ్డను మీ చేతుల్లో పెడుతున్నా. మీ ఇంటి బిడ్డగా, అక్కగా, చెల్లిగా నిండు మనసుతో ఆశీర్వదించాలంటూ కోరారు.

కడియం కావ్య మాట్లాడుతూ..కడియం అంటే ఒక వ్యక్తి కాదు..వ్యవస్థ అని ఇప్పుడు అందరికీ తెలుస్తుందన్నారు. మీ అభిమానం, సహకారం ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని కోరారు. కడియంకు ఉన్న ఆస్తి నియోజకవర్గ ప్రజలే అని గ్ను చేశారు. నీతి, నిజాయితీలే అయన అంతస్తులన్నారు. మీ అందరి సహకారంతో మీ ముందుకు వస్తున్నా. మీ ఇంటి బిడ్డగా నన్ను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. మీ అందరికి సేవ చేసే అవకాశం నాకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# భయపడి పార్టీ మారను

**ఓడిపోయినా మళ్లీ నిలబడుతా**

**త్వరలోనే బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య తేడా చూస్తారు**

**అధికారం ఉందని కార్యకర్తలను ఇబ్బంది పెడితే రోడ్డుపైకి వస్తాం**



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు లీడర్లు కాంగ్రెస్ పార్టీ అధికారానికి బయపడి ఆ పార్టీలో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆరోపించారు. ఇతరులు మాదిరిగా భయపడి పార్టీ మారే వ్యక్తిని కాదన్నారు. శనివారం స్థానికంగా నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు 100 రోజులైన నెరవేర్చకపోవటంతో ప్రజలు ఈసడించుకుంటున్నారన్నారు. పోరపాటు సరిద్దిదుకునేందుకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్ధులను గెలుపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో చివరి సారిగా తనను గెలిపించాలని కోరిన మాట వాస్తవమే అన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినందున తిరిగి ప్రజలు గెలిపించే వరకు మరల తానే ఎమ్మెల్యేగా నిలబడతానని వాఖ్యనించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పాలన మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారం ఉందని కార్యకర్తలను ఇబ్బంది పెడితే రోడ్డుపైకి వచ్చి తాడోపేడో తెల్చుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలు నాయక్, ఉయ్యాలవాడ ఎంపీటీసీ నున్న మల్లిఖార్జున్, కోటి శంకర్, సోసైటి చైర్మన్ బిక్షం రెడ్డి, పట్టణాధ్యక్షులు విద్యాసాగర్, మన్యు పాట్నీ, మైనార్టీ నాయకులు గౌస్, కౌన్సిలర్లు పోటు జనార్దన్, శరత్, తేజావత్ సంధ్య రమేష్, కో ఆప్షన్ సభ్యులు మియా, రాంభద్రం, మాజీ సర్పంచ్ పాండు నాయక్, శ్రీనివాస్, ఉప సర్పంచ్ మోహన్ యశోదర్, కొత్త వీరన్న, చంటీ, బొర్రోజు శ్రీనివాస్,రాము తదితరులు పాల్గొన్నారు.

## కోటంచ ఆదాయం రూ.15.62లక్షలు

**59 గ్రాముల బంగారం, 2.3 గ్రాములు వెండి లభ్యం**



**వరంగల్ వాయిస్, రేగొండ :** రేగొండ మండలంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామీ బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. ఈ నెల 19 నుంచి 27 వరకు 8 రోజుల పాటు వచ్చిన హుండీ ఆదాయాన్ని శనివారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. ఈ సందర్భంగా నగదు రూపంలో రూ. 15,62,179 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్ తెలిపారు. వీటితో పాటు బంగారం 59 గ్రాములు, వెండి 2.300 గ్రామాలు వచ్చాయన్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ పర్యవేక్షకులు శేకర్, ఆలయ కమిటీ చైర్మన్ మల్కనూరి భిక్షపతి ,ఆలయ ప్రధాన అర్చకులు బుచ్చమాచార్యులు, శ్రీనివాసచార్యులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కోమురాజు రవి, ఆలయ సిబ్బంది గోరంట్ల శ్రావణ్, నాగుల సుదర్శన్, సుధాకర్, కళాకారుల సంఘం నాయకులు నిమ్మల రాజు ధర్మకర్తలు మల్లెబోయిన శ్రీధర్, మూల ఓంకార్, డోబిలి కోటేశ్వరరావు, గుర్రాల శ్రీనివాస్ రెడ్డి, శ్రీపతి సుదర్శన్, పేరాల తిరుపతి, సబ్బిడి సంజీవరెడ్డి, కనుకుంట్ల జోగేందర్, సదిరం లక్ష్మి, గ్రామ పెద్దలు డోబిలి శ్యామ్ రావు, బొడిగే భాస్కర్, అలవాల రాజయ్య, భజన భక్తులు తదితరులు భక్తులు పాల్గొన్నారు.

## డిస్ట్రిక్ట్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎల్లగౌడ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వాకర్స్ ఇంటర్నేషనల్ 303 పరిధిలోని డిస్ట్రిక్ట్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని తడక కుమారస్వామి గౌడ్, ఏకశిలా పార్కు వాకర్స్ సమక్షంలో శనివారం ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా పచ్చిమట్ల ఎల్ల గౌడ్, ఉపాధ్యక్షులుగా గిరిజ, కార్యదర్శిగా కస్తూరి రాజు, జాయింట్ సెక్రటరీగా రవీందర్ రావు, కోశాధికారిగా వెంకటలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా బి.కుమారస్వామి, ఉపెందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా గౌరవ అధ్యక్షుడిగా తడక కుమారస్వామి గౌడ్, సలాదారుడిగా చింతం సారంగపాణి నియమితులయ్యారు. డిస్ట్రిక్ట్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గత ఐదు సంవత్సరాలుగా తడక కుమారస్వామి గౌడ్ సేవలందించారు.

## రామకృష్ణకే ఎంపీ టికెట్ ఇవ్వాలి

**సోనియమ్మ, రేవంత్ రెడ్డి ఆశీస్సులతో విజయం సాధిస్తాం**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఏఐసీసీ, సీఈసీ, సీడబ్ల్యూసీ పెద్దలు, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో తనకు వరంగల్ ఎంపీ టికెట్ కేటాయిస్తే విజయం సాధిస్తామని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఢిల్లీలోని పలువురు నేతలను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లా దళిత క్రైస్తవుల సంఘ నాయకులు ఐజాక్ జోసెఫ్ ప్రభాకర్ బీసీ సంఘ నాయకులు సాయిని నరేందర్ రవితేజ జగన్ గౌడ్ ఎస్టీ సంఘ నాయకులు సాంబయ్య ఓసీ సంఘ నాయకులు దేవేందర్ రెడ్డి హెల్త్ డిపార్ట్మెంట్ నాయకులు ప్రసాద్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ నాయకులు శ్రీధర్ రెడ్డి అందరూ విలేకరుల సమావేశం పెట్టి రామకృష్ణకు టికెట్ ఇవ్వాలని గడిచిన రెండు నెలలనుంచి కోరుతున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్న తనపై ఎన్నో కేసులు పెట్టినా భయపడకుండా ఎదురు నిలిచానని గుర్తు చేశారు. నా గొంతుకను పార్లమెంట్ లో వినిపిస్తూ ప్రజల కష్టాలను వివరించే వ్యక్తిగా నన్ను గుర్తించి నాకు టికెట్ కేటాయింపు చేస్తారని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com